సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



'త్రీఫేజ్' లేక తిప్పలు..!
తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పలు గ్రామాల్లో నేటికీ త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸



ఎస్సార్పీ 3 గనిలో గ్యాస్ ప్రమాదం
మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఎస్సార్పీ 3గనిలో గురువారం గ్యాస్ ప్రమాదం సంభవించింది. ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగలేదు. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.1 /17.7
ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ వేడి కొనసాగుతుంది. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై గురువారం నుంచి తెలంగాణ నైపుణ్య అకాడమీ(టాస్క్) ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే వివిధ అంశాల్లో నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా విద్యార్థులకు అకాడమిక్ అంశాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రజెంటేషన్ స్కిల్స్, పోటీ పరీక్షలకు ఉపయోగపడే అర్థమెటిక్, రీజనింగ్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులు మూడు రోజులపాటు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల టాస్క్ కోఆర్డినేటర్ టి.దత్తాత్రేయ, శిక్షణ నిపుణులు జి.సతీశ్, అధ్యాపకులు దేవేందర్, రాజేశ్వర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

27న బహిరంగ వేలం

ఆసిఫాబాద్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుబడిన 268 క్వింటాళ్ల(సరైన స్థితిలో లేనివి) బియ్యానికి ఈ నెల 27న బెజ్జూర్, జైనూర్ ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రాజేశం ఒక ప్రకటనలో తెలిపారు. బెజ్జూర్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో 151.00 క్వింటాళ్లు, జైనూర్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 117.50 క్వింటాళ్ల బియ్యం నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు జిల్లా సివిల్ సప్లై అధికారి పేరుతో రూ.2 వేలు జాతీయ బ్యాంకు ద్వారా డీడీ రూపంలో చెల్లించి దరఖాస్తు ఫారం పొందవచ్చన్నారు. వేలంలో పాల్గొనే ముందు రూ.80,000 ఈఎండీ రూపంలో బ్యాంకు డీడీ చెల్లించి ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలలోగా సమర్పించాలని సూచించారు. బహిరంగ వేలం రద్దు చేసేందుకు, తేదీ మార్చేందుకు కలెక్టర్‌కు సర్వాధికారాలు ఉంటాయని స్పష్టం చేశారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అండర్ 14, 16, 18 విభాగాల్లో 400 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించామన్నారు. మొత్తం 125 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ చూపిన 16 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26న హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్, పీఈటీ, పీడీలు విద్యాసాగర్, మీనారెడ్డి, రాకేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు


కాశీరాం శరీరంపై గాయం

కెరమెరి(ఆసిఫాబాద్): గ్రామాల్లో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. కెరమెరి మండలం సందుగూడకు చెందిన ఇద్దరిపై గురువారం పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. మొదట ఎద్దును కరిచేందుకు ఓ పిచ్చికుక్క ప్రయత్నించగా సందుగూడ గ్రామానికి చెందిన కాశీరాం అడ్డుకున్నారు. కాసేపటికే ఆయన మంచంపై ఉండగా కుక్క దాడి చేసి భుజం కింద కరిచింది. కాశీరాంను వెంటనే కెరమెరి ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచనల మేరకు ఉట్నూర్‌కు అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. కాశీరాంపై దాడి చేసిన తర్వాత అదే కాలనీకి చెందిన సోలంకే రామరావు పిచ్చికుక్క దాడి చేసింది. ఆయన చేతిపైనా గాయాలయ్యాయి. అలాగే ఓ ఎద్దును కూడా కరిచినట్లు స్థానికులు తెలిపారు. ఒకే రోజు ఇద్దరిపై పిచ్చికుక్క దాడిచేయడంతో వారు ఆందోళన చెందుతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనం

సుందరంగా.. సమీకృతం

- ఏప్రిల్‌లో ప్రారంభానికి ముస్తాబవుతున్న సమీకృత కలెక్టరేట్
- రూ.61 కోట్ల వ్యయంతో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- మూడు అంతస్తుల్లో 31 శాఖలు
- ఇద్దరు అదనపు కలెక్టర్లు, డీఆర్‌వోకు వసతి గృహాలు
- దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ర్యాంపులు
- పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత
- ప్రాంగణంలోనే హెలీప్యాడ్ ఏర్పాటు

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఏప్రిల్‌లో దీనిని ప్రారంభించనున్నారు. అందుకు అనుగుణంగానే శరవేగంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నిర్మాణ పనులన్నీ పూర్తికాగా.. ఫర్నిచర్ ఏర్పాటు, ఎలక్ట్రికల్, బ్యూటిఫికేషన్ పనులు పూర్తి కావాల్సి ఉంది. మార్చి నెలాఖరులోగా ఈ పనులన్నింటినీ పూర్తి చేయనున్నారు.

రూ.61 కోట్ల నిర్మాణం..
పరిపాలన సౌలభ్యం కోసం ఆధునిక హంగులతో నిర్మిస్తున్న ఈ సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో ఇద్దరు అదనపు కలెక్టర్లు, డీఆర్‌వో కోసం క్వార్టర్లను సైతం నిర్మించారు. 2017లో భవనం పనులకు శంకుస్థాపన చేశారు. నిధులలేమితో కొంత కాలయాపన జరిగినా అనంతరం పనుల్లో వేగం పుంజుకుంది. జీ+2 అంతస్తులుగా నిర్మించిన ఈ భవన విస్తీర్ణం మొత్తం 1.20 లక్షల చదరపు అడుగులు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తు 50 వేల చదరపు అడుగుల చొప్పున, రెండో అంతస్తు 20 వేల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. భవనం నలువైపులా రోడ్లు, ప్రహరీ, గార్డెనింగ్ పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా ప్రాంగణంలో హెలీప్యాడ్ నిర్మాణ పనులు సైతం జరుగుతున్నాయి.

పచ్చదనానికి ప్రాధాన్యత..
కలెక్టరేట్ ప్రాంగణంలో పచ్చదనానికి, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందుకోసం ప్రాంగణం ముందు భాగంలో సువిశాలమైన ప్రదేశంలో గార్డెనింగ్ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఉద్యానవన శాఖ వందలాది రకాల మొక్కలను నాటేందుకు సిద్ధం చేసింది.

మూడు అంతస్తుల్లో 31 శాఖలు
ఒకే సముదాయంలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందించే ఉద్దేశంతో నిర్మించిన ఈ కలెక్టరేట్‌లో మొత్తం 31 శాఖలు పనిచేయనున్నాయి. కలెక్టర్ జిల్లా అధికారులు, సిబ్బందితో మాట్లాడే విధంగా వెయ్యి మంది సామర్థ్యం గల భారీ సమావేశం మందిరంతోపాటు 500 మంది చొప్పున మరో రెండు సమావేశ మందిరాలు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అలాగే దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ర్యాంపులను నిర్మిస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధం చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు పరిశీలన


సమీకృత కలెక్టరేట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో నిర్మాణం చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవనం పనులు పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని హేమంత్ బోర్కడే అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త భవనం పూర్తయితే ప్రజలకు అన్నిరకాల సేవలు ఒకే చోట అందుబాటులో వస్తాయన్నారు. వర్షాకాలంలో వరద నీరు నిలువకుండా డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆదేశించారు. అనంతరం హెలీప్యాడ్ నిర్మాణ పనులతోపాటు సమావేశ మందిరం, కలెక్టర్ చాంబర్, అధికారుల చాంబర్లను పరిశీలించారు. వారి వెంట ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్న, ఎంపీపీ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

అమ్మాయిలకు ఆత్మస్థైర్యం!


కెరమెరి మండలం మోడి కేజీబీవీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు(ఫైల్)

- జిల్లాలో ముగిసిన కరాటే శిక్షణ తరగతులు
- 99 పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక తర్ఫీదు

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో కరాటే శిక్షణను ప్రారంభించింది. విపత్కర సమయాల్లో తమను తాము కాపాడుకునేలా బాలికలకు నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. నాలుగేళ్ల క్రితమే కరాటే శిక్షణను ప్రారంభించినా కోవిడ్ కారణంగా అర్ధాంతరంగా ఈ కార్యక్రమాన్ని నిలిపివేశారు. మళ్లీ ఈ ఏడాది పునరుద్ధరించగా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆత్మరక్షణలో శిక్షణ అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి.

99 పాఠశాలలు ఎంపిక
బాలికలకు కరాటే శిక్షణ అందించేందుకు మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 99 పాఠశాలలను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్యలో శిక్షణ పొందే వీలు కలిగింది. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ కార్యక్రమం ద్వారా కరాటే శిక్షణను ప్రారంభించారు. జనవరి 24 నుంచి ప్రారంభమైన శిక్షణ తరగతులు నెల రోజుల పాటు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం ముగిసింది. కాగా విద్యార్థినులకు శిక్షణ అందించేందుకు ఏజెన్సీల ద్వారా ప్రత్యేకంగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. వీరికి రూ.5వేల చొప్పున చెల్లించేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఆత్మ రక్షణే ప్రధాన ధ్యేయం..
బాలికలను అన్నిరంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. అయితే ఇటీవల చోటుచేసుకుంటున్న అఘాయిత్యాల నుంచి బాలికలు తమను తాము ఆత్మ విశ్వాసంతో ఎదురుకునేందుకు కరాటే శిక్షణ ఎంతగానో తోడ్పడుతుంది. పాఠశాల స్థాయిలో నేర్చుకునే కరాటే వారికి ఆత్మ రక్షణకు దోహదం చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. జాతీయ బాలికల ఎలిమెంటరీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్లికలు, కుట్టుమిషన్‌తోపాటు పలు రకాల నైపుణ్య శిక్షణలు అందించారు.

ఎంతో ఉపయోగం



గతంలో కూడా మా పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు నిర్వహించారు. మళ్లీ శిక్షణ తరగతులు ప్రారంభించడంతో మళ్లీ నేర్చుకునేందుకు అవకాశం కలిగింది. చదువుతోపాటు ఆత్మరక్షణకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగంగా ఉంటాయి.
– బి.యోగిత, తొమ్మిదో తరగతి, కేజీబీవీ

చదువులో ఏకాగ్రత



కరాటే శిక్షణతోపాటు గతంలో మాదిరి కుట్లు, అల్లికలు తదితర అంశాలపై శిక్షణ అందించాలి. కరాటే విద్యార్థుల్లో మనోధైర్యం పెరుగుతుంది. ఏకాగ్రత పెరిగి చదువుపై దృష్టి సారిస్తున్నాం. నెల రోజుల కార్యక్రమంలో ఎంతో నేర్చుకున్నాం.
– ఎం.త్రిష, తొమ్మిదో తరగతి, కేజీబీవీ

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఫారెస్ట్ నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. ఈ మేరకు గురువారం రెబ్బెన సెక్షన్ అధికారి కొమ్మాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ నర్సరీలో పని చేస్తున్న కార్మికులు పది సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలకే పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కార్మికులకు సరైన వేతనాలు అందించకుండా శ్రమ దోపిడీకి గురి చేస్తోందని ఆరోపించారు. పెరిగిన మార్కెట్ ధరలతో ప్రస్తుతం కూలీలకు చెల్లిస్తున్న రూ.250 సరిపోవడం లేదన్నారు. రోజువారీ కూలి రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్, కార్మికులు సరోజ, ప్రియాంక, సంఘమిత్ర, సుమలత, మీనాక్షి, సుజాత, మాయ, కౌసల్య, తారాబాయి, కమల తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి 'ఉపాధి' కల్పించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు

రెబ్బెన(ఆసిఫాబాద్): జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజుల ఉపాధిహామీ పనులు కల్పించాలని అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు అన్నారు. రెబ్బెన మండలం గోలేటిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పనులు కల్పించడంలో ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పని కావాలని కోరిన ప్రతీ కూలీకి పనులు కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు క్షేత్రస్థాయిలో ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం చేసిన పనికి సంబంధించిన వేతనాలు ఇప్పటివరకు అందలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జలేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ తుకారాం, మేట్లు గోర్‌సింగ్, జర్పుల తిరుపతి ఉన్నారు.

హజ్‌యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘం భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హజ్ యాత్ర పోస్టర్లను జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్‌తో కలిసి ఆవిష్కరించారు. ముందుగా జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం హజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ముఫఖం అహ్మద్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లేవారికి కోవిడ్ వ్యాక్సిన్ ఇప్పించాలని కోరారు. డీఎంహెచ్‌వోతో మాట్లాడి యాత్రికులకు కోవిడ్ వ్యాక్సిన్ ఇప్పించేలా చూస్తామని జెడ్పీ వైస్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ వారికి హామీ ఇచ్చారు. హజ్ యాత్రకు వెళ్లేవారు ఈ సేవలను హజ్ సొసైటీ కార్యదర్శి కార్యాలయం నవాజ్ టూర్స్‌లో ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10 వరకు పొందవచ్చని తెలిపారు. కేంద్ర హజ్ కమిటీ శిక్షకులు అల్– హజ్ ఆరిఫ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ దరఖాస్తులను విడుదల చేశారు. కార్యదర్శి 94400 86037 నంబర్‌ను సంప్రదించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ శిక్షకులు అల్– హజ్ ఆరిఫ్ అహ్మద్, ఖలీల్ ఉద్దీన్, ఆఫీస్ రియాజ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, అబ్దుల్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలే రక్ష!

- ఈ నెల 28 వరకు నట్టల నివారణ మందుల పంపిణీ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న పశుసంవర్ధక శాఖ
- జిల్లాలో 4,20,507 గొర్రెలు, మేకలు



కౌటాలలో మేకలకు నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కౌటాల(సిర్పూర్): జిల్లాలో వ్యవసాయం తర్వాత అత్యధిక మంది రైతులు పాడి, జీవాల పెంపకంతోనే ఉపాధి పొందుతున్నారు. ఏటా సీజనల్ వ్యాధులు, పలు రోగాలతో మేకలు, గొర్రెలు పదుల సంఖ్యలో మృతి చెందుతుండటంతో పెంపకం దారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మూగజీవాలను వ్యాధుల నుంచి రక్షించడమే ధ్యేయంగా ఏటా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని గ్రామాల్లో టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నెల 28 వరకు కొనసాగే ఈ కార్యక్రమాన్ని పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పరాన్న జీవులతో ప్రమాదం
గొర్రెలు, మేకల్లో అంతర పరాన్న జీవుల కారణంగా ఏటా భారీగా మరణాలు నమోదవుతున్నాయి. పెంపకం దారులు దాదాపు 30 శాతం ఆదాయాన్ని కోల్పోతున్నారని అంచనా. మేత మేసే సమయంలో పరాన్న జీవుల గుడ్లు జీవాల శరీరంలోకి వెళ్లి వృద్ధి చెందుతాయి. ముఖ్యంగా ఏలికపాములు జీవాల శరీరంలోకి కాలేయం, ఊపిరితిత్తులు, పేగులు, జీర్ణాశయం వంటి అవయవాల్లో స్థావరం ఏర్పర్చుకుని తీవ్ర నష్టం కలిగిస్తాయి. పోషకాలు అందక రక్తహీనతతో జీవాలు క్రమంగా బరువును కోల్పోతాయి. చర్మం గరుకుగా మారడం, మూత్రం ఎక్కువగా పోయడం, ఆకలి లేకపోవడం, దవడ కింద నీరు చేరడం, విరోచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇటీవల మేకలు, గొర్రెలు పెంపకంతో చాలా మంది ఉపాధి పొందుతున్నారు. పెంపకందారులను నట్టల (పరాన్నజీవుల) సమస్య తీవ్రంగా వేధిస్తోంది. అనారోగ్యంతో జీవాలు మృతి చెందుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

క్షేత్రస్థాయిలో 27 బృందాలు..
జిల్లాలో మేకలు 2,59,539 ఉండగా గొర్రెలు 1,60,968 ఉన్నాయి. మొత్తం జిల్లా వ్యాప్తంగా 4,20,507 జీవాలు ఉన్నాయి. వీటికి నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ఈ నెల 22 నుంచి నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమం 28వ తేదీ వరకు కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రెండు ఏరియా పశువైద్యశాలలు ఉండగా 18 ప్రాథమిక పశు వైద్యశాలలు ఉన్నాయి. అలాగే ఏడు సబ్ సెంటర్లు ఉన్నాయి. మొత్తం 27 బృందాలు నట్టల నివారణ టీకాలు వేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



గొర్రెలు, మేకలపై పెంపకం దారులు ప్రత్యేక దృష్టి సారించాలి. బుధవారం నుంచి నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించాం. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. జీవులకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ చేస్తాం. గొల్లకుర్మలు, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి. టీకాలు వేయించడం ద్వారా గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటాయి.
– సురేశ్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

నివారణ చర్యలు, ప్రయోజనాలు

- జీవాలను ఒకే ప్రదేశంలో మేపకుండా 4– 5 రోజులకు ఒకసారి కొత్త ప్రాంతాలకు తీసుకెళ్లాలి. తేమ అధికంగా ఉన్న ప్రాంతాల్లో మేపకుండా జాగ్రత్తలు వహించాలి.
- వాతావరణ పరిస్థితులు, మేత వనరులు, పరాన్న జీవుల ఉధృతి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.
- జీవాలకు వ్యాధి సోకిన వెంటనే మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి సోకినప్పుడు యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు వైద్యాధికారుల సూచన మేరకు ఇప్పించాలి.
- ప్రభుత్వం ఏటా ఉచితంగా అందజేస్తున్న నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించడంతో జీవాలు ఆరోగ్యంగా, బలంగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- పాలు, మాంసం దిగుబడి, నాణ్యత పెరుగుతుంది. ఒక్కో గొర్రె నుంచి సగటున రూ.1,500 నుంచి రూ.2,500 వరకు ఆదాయం పెరుగుతోంది.
- పునరుత్పత్తి శక్తి పెరిగి, మరణాల శాతం తగ్గుతుంది.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



ఆసిఫాబాద్: జిల్లాలోని పోలీస్ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నుంచి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ అత్యంత బాధ్యతాయుతమైనదని అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడటంతో పోలీసుశాఖ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తత ముఖ్యమని, సమయం, సందర్భానికి అనుగుణంగా డ్యూటీలు మారతాయన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగే చిన్నపాటి గొడవలపై కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. అనవసర విషయాల్లో సిబ్బంది జోక్యం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాల సరఫరాపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ముఖ్య సమాచారం, సమస్యలు డయల్ 100కు తెలియజేసేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకతను వివరించాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పని చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ భీమ్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఐటీకోర్ ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూర్(బెల్లంపల్లి): తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గురువారం తెల్లవారు జామున రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్‌పీ అవుట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న గూడ్స్ రైలు తెల్లవారుజామున 1.40 గంటల ప్రాంతంలో ఢీకొట్టింది. మృతుడు బ్లాక్ అండ్ వైట్ కలర్ ఆఫ్ టీ షర్ట్, లైట్ ప్యారెట్ కలర్ షాట్ ధరించి ఉన్నాడు. అతని వద్ద రెడ్, బ్లూకలర్ బ్లాంకెట్లు ఉన్నాయి. మృతదేహాన్ని బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 9440900792, 9440700038 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు దేశీదారు మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో మద్యం పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం తరలిస్తున్న గడి అంజన్న, కామ్రె ప్రవీణ్‌లను విచారించగా కాగజ్‌నగర్‌లోని ఒక మద్యం దుకాణం నుంచి గూడెంలోని బెల్టుదుకాణానికి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులను, కారులోని మద్యాన్ని ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

చుక్కల దుప్పిపై కుక్కల దాడి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్ 9 గ్రామంలోకి గురువారం వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో కాగజ్‌నగర్‌లోకి పశువైద్యశాలకు తరలించారు. పశువైద్యాధికారి విజయ్‌కుమార్ వైద్య చికిత్సలు అందించిన అనంతరం సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. కార్యక్రమంలో బీట్ అధికారి సతీశ్, సిబ్బంది సుధాకర్, ప్రశాంత్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాది ఆత్మహత్య

చెన్నూర్: పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీరాంభట్ల శరత్‌కుమార్ కుమారుడు రాజీవ్ శర్మ (29) మంగళవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాజీవ్ శర్మ బెంగళూర్ హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం చెన్నూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు తీన్మార్ మల్లన్న హాజరయ్యారు.

మద్యం తాగించలేదని కత్తితో దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాంటా చౌరస్తా వద్ద గురువారం మద్యం తాగించలేదని వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం హన్మాన్ బస్తీకి చెందిన శివ, బూడిదగడ్డ బస్తీ వాసి మల్లేశ్ స్నేహితులు. వీరిద్దరు ఎప్పటిమాదిరిగానే కాంటా చౌరస్తా వద్ద కలుసుకున్నారు. తనకు మద్యం తాగించాలని శివ మల్లేశ్‌ను అడిగాడు. ఇందుకు మల్లేశ్ నిరాకరించడంతో కోపోద్రిక్తుడై పక్కనే ఉన్న కొబ్బరిబోండాల దుకాణం వద్ద ఉన్న కత్తి తీసుకుని దాడి చేయడంతో స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 100కు సమాచారం అందించడంతో వన్‌టౌన్ ఎస్సై సంతోశ్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ ఎస్సైని వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు అందలేదన్నారు.

శుభకార్యం ఎట్ల చెయ్యాలె!

- సింగరేణి ఫంక్షన్‌హాళ్లలో అరకొర వసతులు
- కంపుకొడుతున్న టాయిలెట్లు
- ఇబ్బంది పడుతున్న కార్మిక కుటుంబాలు
- ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు వెళ్తే రూ.లక్ష గుల్లా


కృష్ణాకాలనీలోని సింగరేణి ఫంక్షన్‌హాల్

శ్రీరాంపూర్(మంచిర్యాల): వివాహాది, ఇతర శుభకార్యాలు చేసుకోవాలంటే అన్ని వసతులు ఉన్న ఫంక్షన్‌హాల్‌లేక శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంపనీ వ్యాప్తంగా అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో 8 భూగర్భ గనులు, రెండు ఓసీపీల్లో 9,494 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. కార్మికుల కోసం గతంలో సంస్థ యాజమాన్యం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్, కృష్ణాకాలనీ కమ్యూనిటీ హాల్, నస్పూర్ కాలనీ సింగరేణి గార్డెన్ (పాత కమ్యూనిటీ హాల్), సింగరేణి సేవా భవన్, అధికారుల కోసం సీసీసీ టౌన్‌షిప్‌లోని ఎస్సీఓఏ క్లబ్, బంగ్లా ఏరియాలో ఇల్లందు క్లబ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం సింగరేణి గార్డెన్ మినహా మిగిలిన మూడు ఫంక్షన్‌హాళ్లు అధ్వానంగా మారాయి. వీటిలో సీటు కెపాసిటీ నాలుగు వందలకు మించి ఉండదు. వధువు, వరుడు రూంలు సరిగా లేవు. నిర్వహణలేక టాయిలెట్స్ కంపుకొడుతున్నాయి. శ్రీరాంపూర్ సీఈఆర్‌క్లబ్ మధ్యలో సీలింగ్ ఫ్యాన్లు లేకపోవడంతో చెమటలు కక్కుతూ కూర్చోవాల్సిన పరిస్థితి. స్టేజీ ఎత్తు తక్కువగా ఉండడంతో చేతులు పైకెత్తితే ఫ్యాన్లు తగులుతాయి. హ్యాండ్‌వాష్‌లో ఒకే నల్లా పనిచేస్తోంది. సేవా భవన్‌లో స్లాబ్ కిందికి ఉండడంతో వేసవిలో తీవ్ర వేడి వస్తుంది. కృష్ణాకాలనీ కమ్యూనిటీ హాల్ సీలింగ్ అధ్వానంగా ఉంది. వంట షెడ్డు చాలా చిన్నదిగా ఉంది. అన్ని హాళ్లలో రీసౌండ్ వస్తోంది.

కంపెనీ వసూలు చేసే అద్దె (విద్యుత్ బిల్లులు అదనం)

కమ్యూనిటీహాల్	క్లబ్ సభ్యులకు	ఉద్యోగులకు	ప్రైవేటు వారికి
కృష్ణాకాలనీ	రూ.558	రూ.558	రూ.4,208
నస్పూర్ సేవాభవన్	రూ.558	రూ.558	రూ.4,208
సీఈఆర్ క్లబ్	రూ.8వేలు	రూ.13వేలు	రూ.18వేలు
సింగరేణి గార్డెన్	రూ.4,208	రూ.4,208	లేదు

ప్రైవేటుకు వెళ్తే తడిసి మోపెడు...

ఇన్ని అసౌకర్యాల నడుమ ఫంక్షన్ చేసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో చాలా మంది కార్మికులు ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఒక్కో ఫంక్షన్‌కు రూ.లక్ష వరకు అద్దె చెల్లించాల్సి వస్తోంది. మండపం, డెకరేషన్స్‌కు వారు అడిగినంత ఇవ్వాల్సిందే. సింగరేణి ఫంక్షన్‌హాళ్లలో వసతులు లేని కారణంగానే వీటికి డిమాండ్ ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు. వేలకోట్ల డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను సింగరేణికి సంబంధంలేని ఏరియాల్లో అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నారని, కార్మికులకు అవసరమైన ఫంక్షన్‌హాళ్లలో సౌకర్యాలపై పట్టించుకోకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సువిశాలమైన కంపెనీ స్థలంలో అన్ని హంగులు, ఆధునిక సౌకర్యాలతో ప్రైవేటుకు దీటుగా ఏరియాకు ఒకటైనా ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేయాలని సింగరేణి కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

యాజమాన్యానికి విన్నవిస్తాం



ప్రస్తుతం కంపనీలో ఉన్న అన్ని కమ్యూనిటీ హాళ్లు, క్లబ్బులు చాలా ఏళ్ల క్రితం నిర్మించనవే. వీటిని ఎంత ఆధునీకరించినా శుభకార్యాలకు అనుకూలంగా ఉండడంలేదు. ఈ అసౌకర్యాలతో కార్మికులు ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లకు దీటుగా కంపనీ వెయ్యి మంది కూర్చునేలా అన్ని వసతులు, హంగులతో కూడిన ఏరియాకో ఫంక్షన్‌హాల్ నిర్మించాలి. దీనిపై యాజమాన్యానికి విన్నవిస్తాం.
– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

'కంటి వెలుగు' సద్వినియోగించుకోవాలి


శిబిరాన్ని సందర్శించిన సుబ్బారాయుడు

తాండూర్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు కోరారు. గురువారం మాదారం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరానికి వస్తున్న ప్రజలకు పరీక్షలు చేయాలని సూచించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు కుమారస్వామి, అనిల్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హరితహారం పనులు తనిఖీ

భీమారం(చెన్నూర్): మండలంలోని బూర్గుపల్లి, ఎలకేశ్వరం, కొత్తపల్లి గ్రామాల్లో చేపట్టిన హరితహారం పనులను గురువారం హైదరాబాద్‌లోని ఎకౌంట్ జనరల్ (ఏజీ) టీం సభ్యులు తనిఖీ చేశారు. వాటికి ఖర్చుచేసిన నిధుల గురించి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వారివెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సతీశ్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఎం ఎస్తర్ డేవిడ్, కార్యదర్శులు ఉన్నారు.

25న బీసీ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం


మాట్లాడుతున్న నరెడ్ల శ్రీనివాస్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న బీసీ జాగృతి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని గాండ్ల తెలికుల సంఘ భవనంలో కుల సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని బీసీ కుల సంఘాల నాయకులు, బీసీ సామాజిక వర్గాలకు చెందిన రాజకీయ నాయకులు, న్యాయవాదులు, డాక్టర్లు, మేధావులు, జర్నలిస్టులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మడుపు రాంప్రకాశ్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్, అఖిలగాండ్ల తెలి కుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, జాయింట్ సెక్రటరీ నులిగొండ ప్రకాశ్, గౌడ సంఘ నాయకులు గుర్రం రాజేశంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రక్కు బోల్తా

- రూ.8 లక్షల విలువైన ముడి పదార్థం నేలపాలు


బోల్తాపడిన ట్రక్కు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని పాలచెట్టు మూలమలుపు వద్ద గురువారం ఎస్ఎంఈ (స్లర్రీ మిక్స్‌డ్ ఎక్స్‌ప్లోజివ్) ట్రక్కు బోల్తా పడింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని సెంటినరీకాలనీ నుంచి మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని ఓసీకి పది టన్నుల ఎస్ఎంఈ లోడుతో వస్తున్న ట్రక్కు పాలచెట్టు మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ రమణ ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా రూ.8 లక్షల విలువైన ముడిపదార్థం నేలపాలైంది. సింగరేణి అధికారులు, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు లేకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రాణనష్టం జరుగక ముందే స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జీరో ప్రమాదాలే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న డీడీఎంఎస్ అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): జీరో ప్రమాదాలే లక్ష్యంగా పనిచేయాలని డీడీఎంఎస్ (డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) అధికారులు జ్ఞానేశ్వర్, వెంకన్న, ప్రేంకుమార్ అన్నారు. గురువారం ఎస్సార్పీ 3 గనిలో సింగరేణి సేఫ్టీ జీఎం గురువయ్య ఆధ్వర్యంలో డెరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ శాఖ అధికారులతో సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గనిలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు వంటి వాటిపై చర్చించారు. జీరో ప్రమాదాల సింగరేణిగా తీర్చిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్, ఏజెంట్లు గోపాల్‌సింగ్, సత్యానారాయణ, గని మేనేజర్ సంతోశ్‌కుమార్, సేఫ్టీ అధికారి మహేందర్, వెంటిలేషన్ అధికారి రమేశ్, ఇంజినీర్ అరుణ్‌కుమార్, పిట్ సెక్రటరీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ ప్లీనరీలో జిల్లా నేతలు



సంజీవరెడ్డికి పూలబొకే ఇస్తున్న రమేశ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): రెండు రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ 33వ ప్లీనరీకి జిల్లా నుంచి ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, విద్యుత్ ఉద్యోగుల సంఘం నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్రె రమేశ్, నాయకులు గంగాధర్, నీలం ఐలేశ్ హాజరయ్యారు. ఈ ప్లీనరీలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై చర్చించి పోరాట కార్యక్రమాలను రూపొందించినట్లు వారు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం అవుతున్నాయన్నారు. వీటిని రక్షించుకోవాలంటే కార్మికోద్యమాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత కార్మికవర్గ సమస్యలపై తమ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు.

'గోమాస'పై దాడి అమానుషం



మాట్లాడుతున్న నేతకాని సంఘం నాయకులు

బెల్లంపల్లి: నేతకాని సామాజిక వర్గానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్‌పై దాడి అమానుషమని సంఘం రాష్ట్ర కోర్ కమిటీ చైర్మన్ దుర్గం గోపాల్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తుండగా మార్గమధ్యంలో కాంగ్రెస్‌లోని ఓ వర్గం నాయకులు అటకాయించి దాడి చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు బొర్లకుంట ప్రభాకర్, రామటెంకి వాసుదేవ్, గోమాస భీమయ్య, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గ అధ్యక్షుడు దుర్గం భానుప్రసాద్, శ్రీకాంత్, సంపత్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆ నలుగురికి.. మేమున్నామని

- అన్నాచెల్లెళ్లకు సాయమందించేందుకు ముందుకు..
- నిత్యావసరాలు అందించిన బాలల సంరక్షణ అధికారులు
- నగదు సాయం చేస్తున్న దాతలు


వంటపాత్రలు, సరుకులు అందజేస్తున్న దహెగాం మండల యువకులు

సాక్షి ఎఫెక్ట్..

దహెగాం(సిర్పూర్): తల్లిదండ్రుల ప్రేమకు దూరమై అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్లను ఆదుకోవడానికి మేమున్నామంటూ పలువురు దాతలు ముందుకొస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న ఆ గిరిజన బిడ్డలకు నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, దుస్తులతో పాటు నగదు సాయం అందిస్తున్నారు. దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన సిడాం రాజు అతని చెల్లెళ్లు మమత, దీపిక, దివ్య పడుతున్న అవస్థలపై బుధవారం 'సాక్షి'లో 'అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. చిన్నారులకు రెండో రోజు కూడా దాతలు సాయం అందించేందుకు ముందుకొచ్చారు.

నిత్యావసరాలు అందజేత

అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ ఆధ్వర్యంలో అన్నాచెల్లెళ్ల ఇంటికి వెళ్లి నిత్యావసరాలు అందజేశారు. అనాథలైన పిల్లలను ప్రభుత్వం ఆదుకునేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీప, దివ్యలను గురుకుల పాఠశాలలో చేర్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగురాలైన దివ్యకు పింఛన్ మంజూరు చేస్తామన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్స్ ప్రవీణ్‌కుమార్, జమున, సఖి సిబ్బంది శ్రీనిధి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.

సాయమందిస్తున్న దాతలు

- దహెగాం మండల కేంద్రంతో పాటు, గిరవెల్లి, పంబాపూర్, మర్రిపల్లి, గ్రామాలకు చెందిన యువకులు వంట పాత్రలు, దుస్తులు, నిత్యావసరాలు, పాఠశాలకు వెళ్లే దీపిక, దివ్యకు స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు, నోట్‌పుస్తకాలు, తదితర వస్తువులు అందజేశారు.
- ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు.
- నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన క్రాంతి అతని స్నేహితుల ద్వారా ఆరు నెలలపాటు నెలకు రూ.2 వేలు సాయమందించేందుకు ముందుకు వచ్చారు.
- నర్సాపూర్(జి)కి చెందిన ఉపాధ్యాయుడు నరేందర్ రూ.వెయ్యి అందించారు.
- దహెగాం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. వారి ఇంటికి మరమ్మతు చేయించేందుకు మరికొంత మంది దాతలు ముందుకొచ్చారు.

'దళితులంటే సీఎం కేసీఆర్‌కు వివక్ష'



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుణ

మందమర్రిరూరల్(చెన్నూర్): దళితులంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివక్ష అని, ఎమ్మెల్యే సాయన్న మృతి చెందితే అంత్య క్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ఎందుకు నిర్వహించలేదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గుణ ప్రశ్నించారు. గురువారం మందమర్రిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సినిమా యాక్టర్లు, సెలబ్రిటీలు చనిపోతే అధికార లాంఛనాలతో దహన సంస్కారాలు జరిపిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. దళితులను విస్మరిస్తే కేసీఆర్‌కు పుట్టగతులుండవని రాబోయే ఎన్నికల్లో తగినరీతిలో బుద్ధిచెప్తారన్నారు. సమావేశంలో నాయకులు భవాని, వినోద, విజయ్, శ్రీకాంత్ ఉన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు లాంఛనంగా జరిపించకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత ద్రోహి అనిపించుకున్నారని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేవీ ప్రతాప్‌పై దాడి గర్హనీయం

బెల్లంపల్లి: ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేవీ ప్రతాప్‌పై దాడి గర్హనీయమని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు జైన శ్రీనివాస్, రాజన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో సౌమ్యుడిగా పేరున్న ప్రతాప్‌పై చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. మంచి వ్యక్తిత్వం, ప్రజా నాయకుడిగా పేరుగాంచిన ప్రతాప్‌పై దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ శ్రేణులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఎల్ఐసీ స్వర్ణోత్సవ సంబురాలు


సంబరాలు జరుపుకుంటున్న ఉద్యోగులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం స్వర్ణోత్సవ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్‌వీ ప్రసాదరావు, మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కే శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ సంజయ్ కేక్ కట్ చేశారు. డివిజనల్ మేనేజర్ ఎస్‌వి ప్రసాదరావు మాట్లాడుతూ మంచిర్యాల ఎల్ఐసీ శాఖ వ్యాపార లావాదేవీలలో దేశంలోని 2048 శాఖలలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అత్యధికంగా పాలసీలు చేయించిన ఏజెంట్లకు ప్రతిభా పురస్కారాలు అందించారు. సభ్యులు నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన చెన్నూర్, లక్సెట్టిపేట జట్లకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు, ఉద్యోగులు, లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మంచిర్యాల బ్రాంచ్ అధ్యక్షుడు జే తిరుపతయ్య, సభ్యులు సాగర్, వాసు, రాజేశం, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సదరం శిబిరాలు

పాతమంచిర్యాల: జిల్లాలో మార్చి1 నుంచి నిర్వహించనున్న సదరం వైద్య శిబిరాలను అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ కాల పరిమితి పూర్తయిన వారు రెన్యూవల్ కోసం స్లాట్ బుక్ చేసుకుని శిబిరానికి హాజరుకావాలని ఆయన కోరారు.

బ్లడ్ క్యాన్సర్‌తో బాలుడు మృతి

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్ది జశ్వంత్(12)బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్దిసునీత–రమేశ్ దంపతుల ఏకైక కుమారుడు జశ్వంత్. మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న జశ్వంత్‌కు తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ నెల 22న ఇంటికి వచ్చిన జశ్వంత్ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు752 విద్యార్థులకు గానూ 716 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 486 మందికి గానూ 473 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

రెండు వాహనాలు సీజ్

లక్సెట్టిపేట: ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని ఎంవీఐ రాహుల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేని రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అన్నిరకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను పోలీస్ స్టేషన్‌ను తరలించారు.

కుక్కల బెడద నివారించాలి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద నివారించాలని కోరుతూ గురువారం పట్టణ యువకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో పిచ్చి కుక్కలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది స్పందించి కుక్కల బెడద నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమియోద్దీన్, వాహిద్, సాజిత్‌ఖాన్, జావిద్‌ఖాన్, రాములు, తిరుపతి పాల్గొన్నారు.